



పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

కార్తీకం..ఆరంభం

రాజమహేంద్రవరం సిటీ/కాకినాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి నదీతీరం కార్తీక పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. బుధవారం వేకువజామున 2:30 గంటల నుంచి భక్తులు రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవు, కోటిలింగాల రేవు, పద్మావతి ఘాట్, టీటీడీ ఘాట్, సరస్వతిఘాట్, గౌతమి ఘాట్‌లతోపాటు కాకినాడ జిల్లాలోని పిఠాపురం, సామర్లకోట పుష్కరిణులు సహా పలుచోట్ల భక్తులు గోదావరి స్నానాలు ఆచరించారు. కుటుంబాలతో రేవులకు చేరుకుని భక్తిశ్రద్ధలతో స్నానాలు చేశారు. రేవులో పిండిముగ్గు వేసి దానిలో పసుపు, కుంకుమ దిద్ది, తమలపాకులో పసుపుముద్దతో దేవుడి ప్రతిమ చేసుకుని పిండి ప్రమిదల్లో దీపం వెలిగించుకుని మహిళలు పూజ చేశారు. కార్తీక దీపాలను గోదావరినదిలో విడిచి పెట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో రేవులన్నీ కిక్కిరిశాయి. భక్తజనం రేవుల సమీపంలోని దేవాలయాల్లో స్వామికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద, నందీశ్వరుడి వద్ద దీపాలు వెలిగించారు. సామర్లకోట భీమేశ్వరాలయంతోపాటు పలు శివాలయాలు కార్తీక శోభతో ప్రజ్వరిల్లాయి.







రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు





కాటేసిన

కామాంధులు!

కామాతురాణాం నభయం..నలజ్జ.. కామంతో కళ్లు మూసుకుపోయిన వాడికి సిగ్గు ఉండదు.. భయం ఉండదు.. ప్రస్తుతం సమాజంలో పరిస్థితి అలాగే ఉంది.. వావి వరుసలు మర్చిపోతున్నారు.. కామాంధులైపోతున్నారు.. రాజమహేంద్రవరం, తునిలో జరిగిన రెండు ఘటనలే అందుకు ఉదాహరణ. ఒకడు అన్నను అంటూ హాస్టల్ వార్డెన్‌కి మాయమాటలు చెప్పి బాలికను తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.. మరొకడు తాతయ్యను అంటూ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు.. ఈ రెండు ఘటనలు సమాజంలో బాలికల రక్షణను ప్రశ్నిస్తున్నాయి..

7 మెయిన్‌లో..

మూడేనా!

ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఇంకా ఏడాదే



- ఆరునెలల ముందే ఎన్నికలు?
- ముగిసిన నాలుగేళ్ల పదవీకాలం
- మూడు జిల్లాలకు మూడు జడ్పీలు
- వచ్చే ఏడాది నుంచి ముక్కలు
- విభజిత జిల్లాల్లో సర్దుబాట్లు
- పశ్చిమ నుంచి 10 జడ్పీటీసీలు
- ఓటర్ల జాబితాలపై కుస్తీ
- ఎంపీడీవోలు, రెగ్యులర్ పోస్టుల భర్తీ
- ఇప్పటికే జడ్పీ ఆస్తుల విభజన పూర్తి
- ఆదాయాలపై నివేదికలు సిద్ధం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో జడ్పీ విభజనకు సమయం ముంచుకొస్తోంది. వచ్చే ఏడాది నాటికి మూడు జిల్లాలకు మూడు జిల్లా పరిషత్‌లు ఏర్పాటు కాబోతున్నాయి. ప్రస్తుత ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఏడాది మాత్రమే కాల వ్యవధి మిగిలి ఉండడంతో కొత్త జడ్పీల ఏర్పాటుపై తాజాగా ఉద్యోగ వర్గాల్లో చర్చ మొదలైంది. గత నెలతో ఉమ్మడి జిల్లా పరిషత్‌కు నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయింది.మిగిలిన ఏడాది కాలానికి ఆరు నెలల ముందే ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో తాజాగా అధికారులు విభజిత జిల్లాల ఆధారంగా ఓటర్ల జాబితా విభజనపై దృష్టిసారించారు.అటు ప్రభుత్వం సైతం రెగ్యులర్ పోస్టుల భర్తీ చేపడుతుండగా, మరో పక్క జడ్పీ ఆస్తుల లెక్క తేలిపోయింది.

మూడింటికి మూడు..

11 నెలల్లో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలకు మూడు జడ్పీలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో జిల్లా పరిషత్‌లకు 2021లో ఎన్నికలు జరగ్గా సెప్టెంబరులో ఫలితాలు విడుదలయ్యాయి. దీంతో గత నెలలో ముగిసిన సెప్టెంబరుతో వీటికి నాలుగేళ్ల పదవీకాలం పూర్తయింది. అయితే జిల్లా పరిషత్‌లకు కొత్త పాలకవర్గాలకు ఏర్పడిన ఏడాది తర్వాత రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. అయితే న్యాయపరమైన చిక్కుల కారణంగా విభజిత జిల్లాలకు సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీనే కొనసాగించారు. దీంతో ఇప్పటికీ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే జిల్లా పరిషత్ సమావేశాలు జరుగుతున్నాయి. మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు హాజరవుతున్నారు. ప్రస్తుత జడ్పీకి వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఐదేళ్ల పదవీ కాలం పూర్తికానుంది. దీంతో తదుపరి జరిగే జిల్లా పరిషత్ ఎన్నికలు మూడు కొత్త జడ్పీలు విభజించి నిర్వహించాల్సి ఉంది. త్వరలో జరగనున్న పంచాయతీలు, మునిసిపాలిటీలతో పాటే జడ్పీలకు ఎన్నికలు జరగొచ్చనే చర్చ జరుగుతోంది. దీనిపై ఎడతెగని చర్చ జరుగుతోంది. ఏడాదికంటే ముందుగానే ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న రాజధాని అధికారుల సంకేతాలతో ప్రస్తుతం జిల్లా పరిషత్ అధికారులు మూడు కొత్త జడ్పీల ఏర్పాటు, విభజిత జిల్లాల ప్రకారం ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంపై దృష్టిసారించారు.ఆరు నెలల్లో మూడు కొత్త జడ్పీలను ఏర్పాటు చేసే కసరత్తు పుంజుకోనుంది.

వాటిపై స్పష్టత ఎలాగో..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిషత్‌లో 62 మంది జడ్పీటీసీలు, 997 మంది ఎంపీటీసీలు ఉన్నారు.మూడు జిల్లాలకు సంబంధించి ఆయా మండలాల ప్రకారం ఏ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఏ జిల్లా పరిధిలోకి వస్తారనే దానిపై స్పష్టత ఉండడంతో దాని ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమైన ఓటర్ల జాబితాను మండలాలవారీగా విభజించనున్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాల విభజన గందరగోళంగా జరగడంతో ఇప్పటికీ వీటిపై ప్రజలనుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం విభజిత జిల్లాలపై వస్తోన్న అభ్యంతరాలపై మార్పులు చేర్పులు చేయడానికి ఇప్పటికే మంత్రులతో కమిటీని నియమించింది. ఇందులో భాగంగా కోనసీమ జిల్లాలోని మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని వినతులు వెల్లువెత్తాయి. రామచంద్రపురం నియోజకవర్గం మొత్తాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడాన్ని గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. జిల్లాల విభజనలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గాన్ని ఉమ్మడి విశాఖ పరిధిలోని పాడేరు డివిజన్‌లో కలిపి అల్లూరి జిల్లాగా మార్చారు. ఈ నేపథ్యంలో రంపచోడవరంలోని 11 జడ్పీటీసీలు, ఇతర ఎంపీటీసీలను అల్లూరి జిల్లాలో కలపొద్దనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. లేదంటే తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సర్దుబాట్లు ఎలా ఉంటాయనేదాని ఆధారంగా కొత్త జడ్పీల ఏర్పాటు తుది రూపు సంతరించుకోనుంది.

ఆ మూడూ ఇటే..

ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు తూర్పుగోదావరి జిల్లాకు కొత్తగా ఏర్పడే జిల్లా పరిషత్‌లోకి చేరనున్నాయి. ప్రస్తుతం జడ్పీలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొనసాగుతున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న నిడదవోలు,కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలోని జడ్పీటీసీలు ఏలూరులో జరిగే జడ్పీ సమావేశాలకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సి వస్తోంది. అదే కొత్త జడ్పీలు ఏర్పడిన తర్వాత ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో జడ్పీటీసీలు రాజమహేంద్రవరంలో జరిగే జడ్పీ సమావేశాలకు హాజరవుతారు.ప్రధానంగా కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి విభజిత జిల్లాల ప్రకారం ఏర్పడే రాజమహేంద్రవరం జిల్లా పరిషత్‌లో ఈ మూడు నియోజక వర్గాల నుంచి పది మంది జడ్పీటీసీలు చేరనున్నారు.

కసరత్తు వేగంగానే..

కొత్తగా మూడు జడ్పీల ఏర్పాటుకు సంబంధించి అంతర్గతంగా అధికారులు కసరత్తు ఆరంభించారు. వీటికి కూడా ఆరునెలలోపే అంటే జూలైలోగా ఎన్నికలు ఉండొచ్చని పైస్థాయి నుంచి సంకేతాలు అందడంతో ఓటర్ల జాబితాతో పాటు ఆయా మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీవోలను భర్తీ చేస్తున్నారు. జడ్పీ ఎన్నికల నిర్వహణలో ఎంపీడీవోల పాత్ర కీలకం కావడంతో ఈ దిశగా ఇప్పటికే నియామకాలు జరుగుతున్నాయి. సిబ్బంది సర్దుబాటుపైనా అధికారులు దృష్టిసారించారు.ఉమ్మడి జిల్లా పరిషత్‌కు ఉన్న ఆస్తులు ఎంతనేది ఇప్పటికే లెక్క తేల్చారు.మూడు జిల్లాల్లో ఎక్కడికక్కడ జడ్పీకి భవనాలు,అద్దెల రూపంలో వచ్చే ఆదాయం ,స్థలాలు గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు.

పార్కులను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

- కాకినాడ నగరపాలక సంస్థలో వివిధ సౌకర్యాల ఏర్పాటు ద్వారా ఆదాయం పెంపు
- కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న పార్కులను ప్రజలకు మరింత ఆహ్లాదకరంగా సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ సిటీస్ మిషన్‌లో భాగంగా 2016 కేంద్ర ప్రభుత్వం కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపిక చేయడం ద్వారా నగర అభివృద్ధి నూతన దిశలో అడుగులు వేశామని తెలిపారు. ఇందులోభాగంగా ఉద్యానవనాలు, పార్కులు ఆదునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. ఈ అభివృద్ధి ఫలాలు నిరంతరం ప్రజలకు అందాలంటే పార్కుల సద్వినియోగం, సమర్థమైన నిర్వహణ అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా, ఉద్యానవనాల నిర్వహణ బాధ్యతలను కార్పొరేషన్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు సామాజిక బాధ్యతగా ఇవ్వాలనే ఆలోచన దూరదృష్టి కలిగిన నిర్ణయమని తెలిపారు. ఇలా పార్కుల్లో ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, ఫుడ్ కోర్టులు, నెట్ క్రికెట్, గో-కార్ట్ ట్రాక్స్ ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్, బంపర్ కార్స్ వంటి వివిధ సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు వినోదం కలిగించడం మాత్రమే కాకుండా నగర పాలక సంస్థ ఆదాయం కూడా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కాకినాడ నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి ప్రజలు, సంస్థలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని పిలుపునిచ్చారు. అభివృద్ధి దిశలో తీసుకుంటున్న ప్రతి అడుగున నగర భవిష్యత్తును మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తాండవ నదిలో బాలుడి గల్లంతు 7

నరేగా అంబుడ్స్ పర్సన్‌గా మల్లేశ్వరరావు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో జరిగే ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి పనుల పరిశీలన నిమిత్తం అంబుడ్స్ పర్సన్‌గా కే.మల్లేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ జీవో ఆర్‌టీ నెంబరు 819ను బుధవారం జారీ చేసింది. అంబుడ్స్‌పర్సన్ హోదాలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి కూలీల సమస్యలపై వారి నుంచి ఫిర్యాదులను మల్లేశ్వరరావు స్వీకరిస్తారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

జిల్లాలో భారీ వర్షం

- ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం
- సాయంత్రం విరుచుకుపడిన ఈదురుగాలులతో కూడిన వాన
- పలు లోతట్టు ప్రాంతాలు జలమయం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతంగా ఉన్న వాతావరణం, తర్వాత ఉదయం పదిన్నర గంటల సమయంలో చినుకులు మొదలయ్యాయి. కొద్దిసేపు అక్కడక్కడా వర్షం కురిసింది. సాయంత్రం 4గంటల సమయంలో మాత్రం వరుణుడు చెలరేగిపోయాడు. ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం జిల్లాలోని పలు ప్రాంతాలపై విరుచుకుపడింది. ఎడతెరపి లేకుండా లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. చినుకుపడితే చాలు చెరువులా మారే కాకినాడ నగరంలోని పలు ప్రాంతాలు షరామామూలుగానే జలమయమయ్యాయి. రామకృష్ణారావుపేట, సంజయ్‌నగర్, మెయిన్‌రోడ్డు, నూకాలమ్మ గుడి రోడ్డు, రామారావుపేట సుబ్బయ్యహోటల్ సమీపంలోని రహదారులు ఇలా పలు ప్రాంతాల్లో నీరు నిలిచింది.



కాకినాడ నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం

నేడు, రేపు వానలే..

తమిళనాడు తీరానికి నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దాదాపు వాయువ్యదిశగా కదిలి బుధవారం ఉదయం 12 గంటల వరకు అదే ప్రాంతంలో కొనసాగింది. ఇది రాబోయే 24గంటల్లో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మీదుగా వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని కాకినాడ పీఆర్ కళాశాలలో ఉన్న ఐఎండీ మెట్రాలజిస్ట్ రాంబాబు ఆంధ్రజ్యోతికి వివరించారు. ఈ అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లాలో సాధారణ స్థాయి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆయన వెల్లడించారు. కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురుస్తాయన్నారు. గురు, శుక్రవారాల్లోను ఆకాశం మేఘావృతంగానే ఉంటుందని తెలిపారు. ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఆయన తెలిపారు.

వర్షాలతో వరిపంట కోతలకు అంతరాయం

సామర్లకోట,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన కారణంగా 24గంటలుగా పలు దఫాలు కురుస్తున్న వర్షాలకు సామర్లకోట మండలంలో ముందుగా పక్వానికి వచ్చిన ఖరీఫ్ వరిపంట కోతలకు తీవ్ర అంతరాయం నెలకొంది. వారంరోజుల క్రితం మండలంలో పెదబ్రహ్మదేవం, గోలివారి కొత్తూరు, జి.మేడపాడు, వేట్లపాలెంల్లో రైతులు పంటకోతలు ప్రారంభించారు. మధ్యలో దీపావళి ముందురోజు కురిసిన భారీ వర్షానికి రైతులు వ్యవసాయ పనులు నిలిపివేశారు. తిరిగి వాతావరణం కొంతమేర ఆరుదల ఏర్పడినా మబ్బులు, చినుకులు, చలివాతావరణంతో పంట కోతలకు అవాంతరాలు ఏర్పడ్డాయి. దీంతో ఎక్కడిపనులు అక్కడే చందాన రైతుల పరిస్థితి మారింది. ఇప్పటికే పంటకోతలు కోసి, నూర్పిడులు పూర్తిచేసిన రైతులు ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని భద్రపర్చేందుకు కష్టాలు పడుతున్నారు.



ఉదయం నేలపై పడిన వరిపంటను కోస్తున్న కూలీలు

ప్రసూతి సమయంలో

వైద్యంపై నిర్లక్ష్యం వద్దు

- ప్రసూతి మరణాలపై డెత్ ఆడిట్ నిర్వహించాలి
- పిఠాపురం ఆసుపత్రి వైద్యంలో రోల్‌మోడల్‌గా ఉండాలి
- బాలింత శ్రీదుర్గ మృతిపై నివేదిక ఇవ్వండి
- అధికారులతో సమీక్షలో పవన్



పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో బాలింత మృతిపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో జరిగే ప్రసూతి మరణాలపై ఎప్పటికప్పుడు మెటర్నల్ డెత్ ఆడిట్ నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో బిడ్డను ప్రసవించిన అనంతరం సీరియస్ అయి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా మరణించింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బుధవారం జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి తదితర అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రసూతి సమయంలో వైద్య సేవల విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదని స్పష్టం చేశారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో వైద్యురాలి విధి నిర్వహణ తీరు, ఇతర సిబ్బంది పనితీరుపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పిఠాపురం ఆసుపత్రిని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇక్కడ వైద్యం అందించే విధానం ఒక రోల్‌మోడల్‌గా నిలవాలని దిశానిర్దేశం చేశారు.ప్రసూతి మరణాలను సీరియస్‌గా తీసుకోవాలని, తక్షణమే శ్రీదుర్గ మృతి, బిడ్డ ఆరోగ్య పరిస్థితిపై నిపుణులైన వైద్యులతో విచారణ జరిపి కారణాలను నిర్ధేశించాలని సూచించారు. జిల్లాలోని కొన్ని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది తమ విశ్వాసాల ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల వ్యక్తిగత విశ్వాసాల ప్రచారానికి వేదికగా చేయవద్దని స్పష్టం చేశారు. శ్రీదుర్గ మృతిపై విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్ కమిషనరు కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి మరణంపై విచారణకు ఐదుగురు సభ్యుల బృందం

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో సంభవించిన ప్రసూతి మరణంపై లోతుగా విచారణ చేసేందుకు ఐదుగురు అధికారులతో ప్రత్యేక బృందాన్ని నియమిస్తూ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు లావణ్యకుమారి, పాడా పీడీ చైత్రవర్షిణి, ఎఫ్‌ఓజీఎస్‌ఐ కాకినాడ హెచ్‌వోడీ డాక్టరు అనురాగమయి, జీజీహెచ్ పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టరు మాణిక్యం, జీజీహెచ్ ఏవో శేషాంద్ర శర్మలను నియమించారు.ఈ బృందం గురువారం నుంచి విచారణ ప్రారంభించనుంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఐదుగురు సభ్యులతో విచారణ బృందాన్ని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పరమశివునికి ప్రణమిల్లి


- కార్తీక మాసం తొలిరోజు శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- పరమశివునికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు
- పాడ్యమి దీపాలు వెలిగించిన మహిళలు


రాజమహేంద్రవరం గోదావరి నదిలో పాడ్యమి దీపాలు వదులుతున్న మహిళలు


రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో పుణ్యసాన్నాలు చేస్తున్న భక్తులు


పిఠాపురం పాదగయ క్షేత్రంలో పాడ్యమి దీపాలతో భక్తులు




సామర్లకోటలో జ్యోతిర్లింగార్చన

భక్తజనసంద్రమైన పిఠాపురం పాదగయ


కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా పిఠాపురం లోని పాదగయ క్షేత్రం కార్తీక మాసం తొలిరోజైన బుధవారం భక్తజనసంద్రమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే పాదగయకు చేరుకున్న భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక మాసానికి ప్రారంభ సూచకంగా అరటి డొప్పల్లో పాడ్యమి దీపాలు వెలిగించి పుష్కరిణిలో వదిలారు. మహిళలు, చిన్నారులు, భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. స్వయంభూగా వెలసిన రాజరాజేశ్వరీ సమేత కుక్కుటేశ్వరస్వామికి పంచామృత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అభిషేకాలు జరిగాయి. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. శివమాలధారులు, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయమంతా దీపాలు వెలిగించడంతో వెలుగులు విరజిమ్మాయి. ఉచిత అన్నప్రసాదాలు, చిన్నారులకు పాలు, బిస్కట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పాదగయ ఆవరణలో శివలింగానికి అభిషేకం చేస్తున్న శివమాలధారులు


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో గోలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

శివనామస్మరణతో మార్మోగిన సామర్లకోట


భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు, విశేషాలంకరణలో స్వామి

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) పర్యవేక్షణలో తెల్లవారుజామున గోపూజ జరిపారు. భీమేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలను ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో నిర్వహించారు. విశేష పుష్పార్చన జరిపి స్వామివారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 800 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసరు కె.నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తొలిరోజు లక్ష పత్రి పూజలో జగ్గంపేటకు చెందిన కంచర్ల కుటుంబీకులు ఆశీనులయ్యారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు రాత్రివేళ పూరీలు, పుల్కాలు, చపాతీలను ఆలయం వెలుపల భీమేశ్వర అన్నదాన ట్రస్టు ఆవరణలో అందజేస్తామని ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ విలేకరులకు తెలిపారు.


భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

లేటరైట్ తవ్వకాలు, తరలింపుతో జీవితాలు చిన్నాభిన్నం

- లేటరైట్ మైనింగ్ నిలిపివేయాలని డిమాండ్
- డిప్యూటీ సీఎం నివాసంలో ఫిర్యాదు చేసిన అనకాపల్లి జిల్లా గిరిజనులు

పిఠాపురం/గొల్లప్రోలురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ ఎత్తున సాగుతున్న లేటరైట్ తవ్వకాలు, రవాణాతో తమ జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని, భూములు సాగు చేసుకునే అవకాశం కోల్పోయామని అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడా గ్రామాలకు చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి వచ్చి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎంకు తమ సమస్యలు తెలియజేయాలని కోరుతూ జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తామంతా ప్రకృతిపై ఆధారపడి పోడు వ్యవసాయంతో జీవనం సాగించేవాళ్లమని తెలిపారు. 2014, 2021 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వ పెద్దలు ఇక్కడ లాటరైట్ తవ్వకాలను ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నారని చెప్పారు. నిత్యం వందల సంఖ్యలో లారీల్లో లేటరైట్ తరలిపోతోందని తెలిపారు. దీనివల్ల తమ భూములు, తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఆ ప్రాంతంలో నివాసం ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. నాటి ప్రభుత్వ పెద్దలు కోట్లాది రూపాయలను లేటరైట్ మైనింగ్ ద్వారా ఆర్జిస్తూ తమ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేటరైట్ రవాణా చేసే లారీల కింద పడి పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇదే విషయంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని లేటరైట్ మైనింగ్ నిలుపుదల చేయాలని కోరారు. తమ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుందరకోడ పంచాయతీ బబిడికలొద్ది గ్రామ గంగాలమ్మ వెల్ఫేర్ సొసైటీ, తొరడా గ్రామ నందూలమ్మ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఎం.నూకరాజు, టి.శాంతి, చెల్లాయ్యమ్మ, సంకు రమణ, నూకలోవ పాల్గొన్నారు.


జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడా గ్రామాలకు చెందిన గిరిజనులు

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం

నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

- నన్నయలో అంతర్‌జిల్లాల జూడో పురుషులు, మహిళల పోటీలు

దివాన్‌చెరువు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జూడో క్రమశిక్షణ, గౌరవం, అజేయమైన స్ఫూర్తిని సూచిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో జూడో పురుషుల, మహిళల అంతర్ కళాశాలల ఛాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు బుధవారం జరిగాయి. విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీలను వీసీ ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్ కళాశాలల జూడో ఛాంపియన్‌షిప్ నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం క్రీడలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహించే వివిధ క్రీడాపోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. అనంతరం వివిధ కేటగిరీలలో జూడో పురుషులకు, మహిళలకు పోటీలు నిర్వహించారు. మహిళలకు48 కేజీల నుంచి 78 కేజీల వరకూ, పురుషులకు 60 కేజీల నుంచి 100 కేజీల వరకూ పోటీలు జరిగాయి. దీనిలో ఉత్తమ ప్రతిభకనబరచిన విజేతలను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేసి వచ్చేనెల 10 నుంచి 14 వరకూ భోపాల్‌లోని గ్లోబల్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ వెస్ట్‌జోన్ పోటీలకు పంపుతారు. పోటీల అనంతరం విజేతలకు పతకాలను ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, క్రీడాబోర్డు సహాయకార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్.మూర్తి, పరిశీలకుడు ఎస్.వి.ఎల్.ఎల్.జి.వర్మ, సభ్యులు పి.వి.తేజ, టి.వి.వి.రమణ, జిల్లా డి.ఎస్.డి.ఓ. డీఎంఎం శేషగిరి పాల్గొన్నారు.


జూడో పోటీలను తిలకిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

తక్కువ వ్యవధిలో విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ కొత్త విధానం
- దరఖాస్తుతోనే స్థిర చార్జీల వసూళ్లు
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా శ్రీకారం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు కొత్త కనెక్షన్ కావాలంటే దరఖాస్తు సమర్పించిన తరువాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీస్ లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ మొత్తం ఆధారపడి ఉండేది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్'ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విద్యుత్ వినియోగదారుల చట్టం 2020కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కొన్ని సవరణలు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానం తీసుకువచ్చింది. 150 కిలోవాట్ల వరకు కనెక్షన్లకు ఫిక్సిడ్ చార్జీలు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లిస్తే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ అయిపోతాయి. దీనివల్ల చాలా తక్కువ సమయంలో విద్యుత్ సదుపాయం లభిస్తుంది. సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేషన్ వంటివి ఇందులో ఉండవు.

ఎవరికి వర్తిస్తుందంటే..?

ఇప్పటికే విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్నవారు కొత్త కనెక్షన్ తీసుకుంటే చార్జీలు ఇలా ఉంటాయి.

- గృహ వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,500.
- వాణిజ్య వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,800
- ఆపై ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటారు. ఇలా 20 కిలోవాట్ల వరకు లెక్కించి తీసుకుంటారు.

ఇవికాకుండా కనెక్షన్ లోడ్ చార్జీల (డొమెస్టిక్) కింద సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి 500 వాట్ల వరకు రూ.800, ఆపై 501 నుంచి 1000 వాట్ల వరకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది..

నాన్ డొమెస్టిక్/కమర్షియల్ కనెక్షన్లకు

మొదటి 250 వాట్ల వరకు రూ.600, 251 వాట్ల నుంచి 500 వాట్ల వరకు రూ.1,000 కట్టాలి. ఇలా ఎల్‌టీ-3, ఎల్‌టీ-4, హెచ్‌టీ కనెక్షన్ కోరుకునే వారికి చార్జీలు నిర్ణయించారు.

ముందుగా చెల్లించడంతో తక్షణ సేవలు

- పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్



స్థిరమైన చార్జీలు ముందుగానే నిర్ణయించడంవల్ల ఎస్టిమేషన్ పేరుతో జాప్యం ఉండదు. విచక్షణా అధికారంతో అంచనాలు పెంచే అవకాశమూ లేదు. ఎవరికి ఎంత విద్యుత్ లోడ్ పడుతుందో లెక్కించుకొని ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. దీని వల్ల తక్షణమే సేవలు అందించగలుగుతాము. ఇదంతా పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.87 కోట్లు

- బంగారం 47 గ్రాములు, వెండి 1240 గ్రాములు, 25 విదేశీ కరెన్సీ నోట్లు


వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణ అధికారులు డి.సురేష్‌బాబు, జె.రామలింగేశ్వరావు, పీవీవీఎస్ కామేశ్వరావు పరివేక్షణలో స్వామివారి కానుకలు లెక్కింపు నిర్వహించారు. 35 రోజులకుగాను ప్రధాన హుండీలు ద్వారా రూ.1,41,69,487, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.45,63,842 వెరసి రూ.1,87,33,329 ఆదాయం లభించింది. బంగారం 47 గ్రాములు, వెండి 1240 గ్రాములు, ఆరు దేశాలకు చెందిన 25 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో అర్చకులు, వేద పండితులు, బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవకులు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి కార్తీక ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- 2న క్షీరాబ్ది ద్వాదశిరోజున గిరిప్రదక్షణ, తెప్పోత్సవం ఘనంగా నిర్వహించాలి
- లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- అన్నదాన కార్యక్రమాలకు ఎమ్మెల్యే రూ.3లక్షల విరాళం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు

కోరుకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని కోరుకొండ దేవా లయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి దేవ స్థాన కార్యనిర్వహణ అధికారి, ఇతర అధికారులు, వివిధశాఖల అధికారులతో శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే కోరుకొండ శ్రీలక్ష్మీనసిహస్వామి కార్తీకమాస శుద్ధ ద్వాదశి ఉత్సవాలను వైభవంగ నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. లక్ష్మీనరసింహస్వామివారి గిరి ప్రదక్షణ, తెప్పోత్సవం వైభవంగా నిర్వహించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్తీకమాసంలో నవంబర 2న తేదీ క్షీరాబ్ధి ద్వాదశిరోజున గిరిప్రదక్షణ, తెప్పోత్సవంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. కార్తీకశుద్ధ ద్వాదశి (క్షీరాబ్ధిద్వాదశి)రోజున సాయంత్ర 5గంటల నుంచి స్వామివారి విగ్రహాలను పల్లకీపై ఊరేగింపుగా గిరి ప్రదక్షణ నిర్వహిస్తూ కోనేరు వద్ద నిర్వహించే తెప్పోత్సవం విజయవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైదిక కార్యక్రమం నిర్ణీత సమయానికి తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. తెప్పోత్సవంనకు తగిన ఏర్పాట్లు, ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఇన్స్యూరెన్స్ వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. కోనేరు వద్ద విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని పేర్కొన్నారు. వేదిక వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా కోరుకొండ మెడికల్ అధికారులను ఆదేశించారు. తెప్పోత్సవం సందర్భంగా లైఫ్ జాకెట్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. గజ ఈతగాళ్ళను అందుబాటు ఉంచాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్, అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ సూచించారు. తెప్పోత్సవం విజయవంతం కావడానికి వీలుగా కోనేరులో నీరు నిలిచేలా ఇరిగేషన్ అధికారులు చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య లోపం లేకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కార్తీకమాస ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా జరిగే అన్నదాన కార్యక్రమానికి బత్తుల కుటుంబం నుంచి రూ.3లక్షలు విరాళంను ఎమ్మెల్యే ప్రకటించారు.

కన్నేసి.. కాటేసి!

- ● తునిలో బాలికపై ఘోరం
- ● తాతయ్య వరసయ్యే వృద్ధుడు కాటేసిన వైనం
- ● ఆస్పత్రి పేరుతో బాలికను పాఠశాల నుంచి తీసుకువెళ్లిన నిందితుడు
- ● తొండంగిలో ఓ తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం: ఆనక స్కూల్లో దించేసి ఇంటికి..
- ● వీడియో వైరల్ అవడంతో విషయం తెలిసి నిందితుడిని చితకబాదిన బంధువులు
- ● బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి అత్యాచారంగా నిర్ధారణ
- ● నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు: పోక్సో, అత్యాచారం, కిడ్నాప్ కేసులు నమోదు

దారుణం.. అమానుషం.. మాటల్లో చెప్పలేని ఘోరం.. మాయమాటలు చెప్పి అభం శుభం ఎరుగని బాలికపై అత్యాచారం.. తాతయ్య వరుసయ్యే దగ్గర బంధువే అఘాయిత్యానికి ఒడిగట్టిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా చేసింది..


నారాయణరావును పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

(కాకినాడ/తునిరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారులో ఓ గురుకుల పాఠశాలలో ఓ బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. కొంత కాలం కిందట బాలిక తండ్రి మరణించాడు. ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడంతో ఆమెను చదువు మానిపించేయాలని అనుకున్నా, ఆ పని చేయలేక తల్లి గురుకుల పాఠశాలలో చేర్పించి. వీరికి దగ్గరి బంధువైన తుని పట్టణంలో రెండో వార్డుకు చెందిన తాటిక నారాయణరావు(62) కన్నేశాడు. మాయమాటలు చెప్పి గురుకుల పాఠశాల యాజమాన్యాన్ని తాను బాలిక తాతయ్యగా నమ్మించాడు. అనేకసార్లు పాఠశాలకు వచ్చి బాలికను ఆస్పత్రికి చూపించాలంటూ స్కూల్ నుంచి తీసుకువెళ్లేవాడు. తాతయ్య కావడంతో పాఠశాల సిబ్బందికి కూ డా అనుమానం రాలేదు. ఎప్పటిలా అతడు మంగళవారం ఉదయం 11 గంటలకు స్కూలుకు వచ్చి బాలికను బయటకు తీసుకువెళ్లాడు. అనంతరం ఆమెకు తిను బండారాలు కొనిచ్చాడు. తనంటే ఇష్టం ఏర్పడేలా చేసుకున్నాడు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు తొండంగి మండలం పైడికొండ గ్రామ శివార్లలోని సపోటా తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఓ రైతు గమనించి అక్కడికి వచ్చాడు. నువ్వెవరు.. స్కూలు పిల్లను తోటలోకి తీసుకువచ్చి ఏం చేస్తున్నావంటూ నిలదీశాడు. అత్యాచారం చేసిన నదరు నిందితుడు రైతుపై ఎదురుతిరిగాడు. దీంతో రైతు మరింత ఆగ్రహంతో స్కూలు అమ్మాయిని తోటలోకి తీసుకువచ్చి బట్టలు విప్పి ఏం చేస్తున్నావు.. అంటూ గద్దించాడు. దీంతో నిందితుడు మరింత ఎదురుతిరిగి నేను మున్సిపాలిటీ కౌన్సిలర్‌ను అంటూ గట్టిగా మాట్లాడాడు. బాలికను ఇదే తోటలోకి అనేకసార్లు తీసుకువచ్చి ఇక్కడ ఏం చేస్తున్నావు అంటూ రైతు మళ్లీ నిలదీయడంతో.. నేను పాడు చేశానా.. అమ్మాయి బాత్‌రూంకి అంటే తీసుకువచ్చా అంటూ బుకాయించాడు. బట్టలు విప్పి ఎందుకేస్తున్నావు అని గద్దించి పోలీసులకు ఫోన్ చేస్తా అని రైతు మరింత నిలదీయడంతో తాతయ్యను అవుతాను.. బాత్‌రూంకు తీసుకువచ్చానని అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత గుట్టుగా బాలికను గురుకుల పాఠశాలలో దించేసి ఏం ఎరుగనట్టు తునిలో తన ఇంటికి వెళ్లిపోయాడు.

వైరల్ అవడంతో..

తోటలో బాలికతో నదరు నిందితుడు ఉన్న వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అదికాస్తా క్షణాల్లో వైరల్ అయ్యాయి. దీంతో విషయం బాలిక కుటుంబీకులు, బంధువులకు తెలిసింది. దీంతో వారంతా నదరు నిందితుని నివాసం ఇంటికి వెళ్లి నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో వారంతా నదరు నిందితుడికి మంగళవారం రాత్రి దేహశుద్ధి చేసి తుని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత బుధవారం ఉదయం గురుకుల పాఠశాల ఎదుట బాలిక బంధువులు ఆందోళనకు దిగారు. బాలికను పదేపదే నిందితుడితో ఎలా పంపిస్తారని దానిపై గురుకుల పాఠశాల సిబ్బందిని నిలదీశారు. కానిస్టేబుల్ పోలీసులు రావడంతో వారిని కూడా నిలదీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సాయంత్రం బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు అత్యాచారం జరిగినట్టు నిర్ధారించారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు తుని రూరల్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు తుని రూరల్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 250/2025 కింద యూ/ఎస్ 137 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ప్రిన్సిపాల్ వివరణ..

ఈ ఘటనపై గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగజ్యోతి మాట్లాడుతూ తాను పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరడం వల్ల ఎప్పటి నుంచో కొనసాగుతున్న ఉపాధ్యాయుల ప్రతిపాదన మేరకు బాలిక బయటకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు.

దుష్ప్రచారంపై హెచ్చరిక..


మీడియాతో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ

కాగా నిందితుడు కూటమి పార్టీకి చెందిన వ్యక్తిగా చిత్రీకరించేందుకు వైసీపీ ప్రయత్నం చేయడం వివాదాస్పదంగా మారింది. దీంతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురుకుల పాఠశాల వద్ద మీడియాతో మాట్లాడారు. నిందితుడు నారాయణరావుకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదన్నారు. నారాయణరావుపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. కిడ్నాప్, అత్యాచారం కింద వచ్చే వివిధ కఠినమైన సెక్షన్లు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు. అయితే బాలిక వీడియోను కొందరు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారని, ఇది కూడా పోక్సో కేసులోకి వస్తుందని డీఎస్పీ తెలిపారు. అత్యాచార ఘటనపై ఎంపీ సానా సతీష్‌బాబు, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఖండించి నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

రాజమహేంద్రవరంలో బాలికల హాస్టల్ వార్డెన్ సస్పెండ్

కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సంక్షేమ బాలికల వసతిగృహానికి చెందిన విద్యార్థినిపై అత్యాచారం సంఘటన నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్య వైఖరి నిర్ధారణ కావడంతో హాస్టల్ అధికారిణి ఉమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. బంధువుల వివరాలు, గుర్తింపు నిర్ధారించకుండానే పిల్లలను బయటకు పంపరాదని స్పష్టం చేశారు. వార్డెన్లు, సిబ్బంది సంపూర్ణ బాధ్యతతో అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. వసతిగృహాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

వసతి గృహం విద్యార్థినిపై అఘాయిత్యం దారుణం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యం చాలా దారుణమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. బాలికపై అమానుషం చేసిన అజయ్‌ను అతడికి సహకరించిన మరొక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారని చెప్పారు. వసతిగృహాల వద్దకు తల్లిదండ్రులను తప్ప ఎవరినీ అనుమతించకూడదని, ఎవరైనా వస్తే సరైన ఆధారాలు ఉంటేనే అనుమతి విషయంలో ఆలోచించాలని కోరారు.

బాణసంచా పేలుడు ఘటనలో బాధితులకు.. రూ.కోటి 50 లక్షల చెక్కు అందజేత


చెక్కును కార్మికశాఖ సహాయ కమిషనర్‌కు అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాకలో శ్రీలక్ష్మి గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో ఈ నెల 8న జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులమీదుగా రూ.కోటి 50లక్షల చెక్కును కోనసీమ సహాయ కార్మిక కమిషనర్‌కు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సంఘటనలో పది మంది మృత్యువాత పడ్డారు. పేలుడు వల్ల మరణించిన వారికుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఏపీ కార్మికశాఖ సంక్షేమ మండలి కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కార్మికశాఖ కమిషనర్ రూ.కోటి 50లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ పేరున అందజేశారు. ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం కింద నమోదైన సంస్థల్లో పనిచేసే కార్మికులకు కార్మిక సంక్షేమ మండలి నుంచి రూ.100 వంతున వెల్ఫేర్ ఫండ్ చెల్లించడం జరుగుతుంది. యజమాని వాటా రూ.70, కార్మికుని వాటా రూ.30 చొప్పున చెల్లిస్తారు. దీని ద్వారా సంక్షేమ పథకాలు అందించేవారు. అయితే ఈ పథకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినప్పటికీ కోనసీమ కలెక్టర్ చొరవతో రాయవరం ఘటన బాధితులకు రూ.కోటి 50లక్షలు మంజూరు చేయడం జరిగిందని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ పేర్కొన్నారు.

తాండవ నదిలో బాలుడు గల్లంతు


స్వరాజ్ (ఫైల్)

తుని రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో తాండవ నదిలో 11 ఏళ్ల బాలుడు గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం.. తుని పట్టణంలోని రాజీవ్ గృహకల్పకాలనీకి చెందిన మారిశెట్టి స్వరాజ్ (11), బాలిశెట్టి గణేష్ (14) బుధవారం ఉదయం తుని శివారు కొట్టాం వద్ద తాండవ నదిలో స్నానానికి దిగారు. ఇద్దరు బాలురు గల్లంతవుతుండగా ఇది గమనించి స్థానికులు ఒకరిని కాపాడారు. మారిశెట్టి స్వరాజ్ (11) అనే బాలుడు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గత ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ స్వరాజ్ ఆచూకీ లభించకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


తాండవ నదిలో గాలింపు దృశ్యం

సెపక్‌తక్రా జట్టు రాష్ట్ర కోచ్‌గా గౌతమ్


యాండ్ర గౌతమ్

అమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 27వరకు సీనియర్ పురుష, మహిళల జాతీయస్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీలు గోవాలోని మార్గోవ్ ప్రాంతంలో జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రం తరఫున పురుష జట్టు కోచ్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన కానిస్టేబుల్, ఎన్ఐఎస్ కోచ్ యాండ్ర గౌతమ్‌ను నియమించినట్టు కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసులు ఈ మేరకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌ను ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు.

వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చుకు యువకుడు బలి


వీర కుమార్ (ఫైల్)

ప్రత్తిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగ ఉచ్చుకు యువకుడు బలయ్యాడు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామ పంచాయతీ శివారు ఆరేళ్ల దార వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం గ్రామం సూరావమ్మ గుడి వీధికి చెందిన వండల వీర కుమార్ (31)వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం వేకువ జామునే పని నిమిత్తం వంతాడ యార్డ్ సమీపంలో గల ఆరేళ్లదార పొలాల్లో నడిచి వెళ్తుండగా వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ ఉచ్చుకు కాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పొలాల్లోకి పనికొట్టుకు వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం, ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరకుమార్‌కు భార్య కాసులమ్మ, కొడుకు దుర్గాతేజకుమార్ ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

గాజువాక వాసి మృతి


కిరణ్‌కుమార్ మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

కడియం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక పరిధిలోని బుర్రిలంక గోకుల్‌రెడ్డి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజువాక ఆగనంపూడికి చెందిన వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కడియం పోలీసుల కథనం ప్రకారం.. గాజువాక అగనంపూడికి చెందిన దాసరి కిరణ్‌కుమార్(26) కారులో విజయవాడ నుంచి విశాఖపట్టణం వెళ్తున్నాడు. కడియపులంక వద్ద ఆగి ఉన్న లారీని అదుపుతప్పి కారు ఢీకొనడంతో కిరణ్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. హైవే సేఫ్టీ అధికారులు రెస్క్యూ సహాయంతో లారీ నుంచి కారును వేరు చేయించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కడియం పోలీసులు కేసు నమోదు చేశారు.

మానసిక స్థితి సరిగా లేక బ్లేడుతో గొంతు కోసుకున్న వ్యక్తి


గొంతు కోసుకున్న దాసు

వై.రామవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి బుధవారం వైరామవరం, యర్రగొండ గ్రామాల మధ్య శివాలయం సమీపంలో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే వెళ్లి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా కొయ్యూరు మండల యు.చీడిపాలెం పంచాయతీ కంప మామిడికి చెందిన కాళ్ల దాసు (45)కు మానసిక స్థితి సరిగా లేక గతంలో కుటుంబీకులు రాజమండ్రిలో చికిత్స తీసుకెళ్లారు. ఇంటికొచ్చాక పురుగుల మందు తాగడంతో మళ్లీ కాకినాడ తరలించారు. అక్కడ నుంచి పి.ఎర్రగొండ సచివాలయంలో నర్సుగా పని చేస్తున్న తన అక్క కూతురు ఇంటికి వచ్చిన కాళ్ల దాసు బ్లేడుతో గొంతు కోసుకున్నట్టు బావ కుమార్తె చెప్పారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు పేర్కొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్, మరో ఇద్దరిపై కేసు కొట్టివేత

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏఎంసీ మాజీ చైర్మన్ సున్నితంరెడ్డి వర విశ్వనాథం, మరో ఇద్దరిపై గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి సోదరుడు వీరభద్రారెడ్డి పెట్టిన కేసును కోర్టు బుధవారం కొట్టివేసింది. వివరాలను విశ్వనాథం తెలిపారు. 2019 ఎన్నికల పోలింగ్‌లో అవకతవకలకు పాల్పడినట్టు విశ్వనాథం, మరో ఇద్దరిపై వీరభద్రారెడ్డి కేసు పెట్టారు. దీంతో 2019 మే 26న వీరిపై కేసు నమోదు చేశారు. ఐదేళ్ల పాటు కాకినాడ సెకండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ సాగింది. అభియోగాలు రుజువు కాకపోవడంతో ఈ కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

రైల్వే భూములు ఆక్రమించి కట్టడాలు

చర్యలు తీసుకోవాలని కాకినాడ కలెక్టర్‌కు రైల్వే అధికారుల ఫిర్యాదు

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో ఎఫ్‌సీఐ గోదాముల నుంచి రైల్వే స్టేషన్ వరకూ సుమారు 28కిలోమీటర్ల ట్రాక్ పొడవునా రైల్వే భూములు ఆక్రమించి కట్టడాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రైల్వే విజయవాడ డివిజనల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రైల్వే అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ ఎస్.శ్రీనివాసరావు సామర్లకోట మండల సర్వేయర్లు బుధవారం సామర్లకోట రైల్వే ఏఈఎన్ ప్రభాకర్‌తో సమీక్షించారు. సర్వేయర్లు వద్ద ఉన్న పాత అడంగల్ మ్యాపులను అధికారులు పరిశీలించారు. వాస్తవంగా ఉన్న కనిపిస్తున్న విస్తీర్ణానికి పాత అడంగల్‌లో ఉన్న విస్తీర్ణానికి ఎక్కడ పొంతనలేకుండా ఆక్రమణలు పెరిగి పోయినట్టు రైల్వే అధికారులు గుర్తించారు. అలాగే మట్టపల్లి వారి చెరువు వద్ద నుంచి పార్కు జలాలు బయటకు వెళ్లేందుకు 15ఏళ్ల క్రితం నిర్మించిన స్లూయిస్ క్రాస్ కల్వర్టును ఆక్రమించి చెరువు నుంచి జలాలు రైల్వే ట్రాకుపైనుంచే ప్రవహించేందుకు వీలులేకుండా పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడినట్టు ప్రాథమికంగా రైల్వే అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణల వల్లే సామర్లకోట ఎగువ ప్రాంతాల్లో వర్షం నీరు సత్యనారాయణపురం మీదుగా రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం కలుగుతుందని నివేదికను విజయవాడ రైల్వే ఉన్నతాధికారులకు పంపినట్టు సమాచారం.

దైవ దర్శనానికి వెళ్తుండగా విషాదం

- ● వ్యాన్ ఢీకొని కుమారుడి మృతి
- ● తల్లిదండ్రులకు గాయాలు
- ● గుత్తులవారిపాలెం సమీపంలో ఘటన


మృతిచెందిన రామవెంకటకృష్ణప్రసాద్ (ఫైల్)


గాయపడిన నూకరత్నంను ఆటోలో తరలిస్తున్న దృశ్యం


గాయపడిన నూకరాజు

ముమ్మిడివరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న వారిని కోళ్ల వ్యాను ఢీకొనడంతో మోటార్ సైకిల్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా అతడి తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డులో గుత్తులవారిపాలెం సమీపంలో బుధవారం జరిగింది. యానాం సుబ్బడ నగర్‌కు చెందిన దింప కార్మికులు మట్టపర్తి నూకరాజు (50), అతడి భార్య నూకరత్నం (47), కుమారుడు రామవెంకటకృష్ణప్రసాద్ (22) పల్సర్ మోటారు సైకిల్‌పై అప్పనపల్లి బాలాజీని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా ముమ్మిడివరం బైపాస్ రోడ్డు గుత్తులవారిపాలెం సమీపంలో ఎదురుగా తాళ్లరేవు వస్తున్న కోళ్ల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామవెంకటకృష్ణప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి నూకరాజు, తల్లి నూకరత్నం తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న బీజేపీ ఏపీడీ టీవిశ్వనాథం స్పందించి అంబులెన్సుకు ఫోన్ చేయగా అది రావడం ఆలస్యం అవుతుందని భావించి గాయపడిన నూకరత్నం, నూకరాజును ఆటోలో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ టి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ విశ్వనాథం మాట్లాడుతూ ప్రమాదాలు ఎలా జరుగుతాయో ముందుగా ఎవరూ ఊహించలేమని, మనవంతు జాగ్రత్తలు పాటించాలన్నారు. వెంకటకృష్ణప్రసాద్ హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృత్యువాతకు గురయ్యాడన్నారు.

వ్యక్తి హత్య కేసులో ఐదుగురి అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, చిత్రంలో సర్కిల్‌లోని ఎస్ఐలు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన తమిళనాడుకు చెందిన వ్యక్తి హత్య కేసులో ఐదుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ వెల్లడించారు. పిఠాపురం పట్టణ శివారులోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల వానంశెట్టి పెద్దిరాజు పొలంలో తల, శరీరంపై గల గాయాలతో మరణించి ఉన్నట్టు వీఆర్వో కామేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 8న పిఠాపురం పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ, రూరల్, కొత్తపల్లి ఎస్ఐలు మణికుమార్, జానీబాషా, వెంకటేష్ ఆధ్వర్యంలో 3 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, సీసీ ఫుటేజీలు, సాక్షుల కథనాల ఆధారంగా విచారణ సాగించి మృతుడిని తమిళనాడు రాష్ట్రంలోని తేని జిల్లా మైలాదుంబారై ప్రాంతంలోని కొమసనపంబై వంద యతీ మనుతు గ్రామానికి చెందిన పాండిగా గుర్తించారు. ఇతడు హనుమాన్ జంక్షన్ ప్రాంతంలోని తెనుబండారా తయారీ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. ఇతడికి అక్కడ తమిళనాడు రాష్ట్రం తూతికుడి జిల్లా పెరియసామిపురం ప్రాంతానికి చెందిన పొటరాజ్ ఆండోనీ, లారు పకియం, మెల్లెండా గ్రామానికి చెందిన మడసామి కారుప్పస్వామితో పరిచయం ఏర్పడింది. వీరు అక్కడే పనిచేసే పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన పూడి దనలక్ష్మి (దనమ్మ) వద్ద రామస్వామికి ఆరోగ్యం బాగోలేక పోవడంతో పరామర్శకు వచ్చారు. అక్కడ పాండే దనమ్మతో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు చెప్తున్నారు. దీంతో 7వ తేదీ రాత్రి ఆండోని, దనమ్మ, పకియం, సామి, పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాగంటి గణేష్‌తో కలిసి పాండేను హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కాగా హత్యకు గల కారణాలపై పోలీసులు చెప్తున్న వివరాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గంజాయి విషయంలో వారి మధ్య జరిగిన ఘర్షణే హత్యకు దారి తీసినట్టు సమాచారం. ఇదే విషయం పట్టణంలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది.

దర్జా దొంగ దొరికాడు!

- » పోలీసుల అదుపులో కార్ల దొంగ
- » నిందితుడు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం వాసి
- » ఏప్రిల్‌లో ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ వద్ద చోరీ
- » 241 గ్రాముల బంగారు ఆభరణాలతో ఉడాయింపు
- » తునిలో పట్టుకున్న పోలీసులు.. విజయవాడకు తరలింపు

ఇంటి దగ్గర నుంచి దర్జాగా కారులో బయల్దేరుతాడు. ఆలయాల వద్ద నిలిపిన కార్ల వద్ద అటూ ఇటూ తిరుగుతాడు. ఆయుధం పట్టకుండా చేత్తో కారు తలుపులు తెరుస్తాడు. ఆభరణాలు, నగదును చిటికెలో మాయం చేస్తాడు. భక్తుల కార్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): అమలాపురానికి చెందిన ఆచంట దుర్గ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. అమలాపురంలో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు ఏప్రిల్ 15న బయల్దేరిన ఈ కుటుంబం దారిలో దుర్గమ్మ దర్శనం చేసుకోవాలనుకుంది. ఇంద్రకీలాద్రిపై ఓం మలుపు వద్ద కారును నిలుపుదల చేసి, డోర్ లాక్ చేసుకుని దర్శనానికి వెళ్లారు. ఈ కారులో నుంచి 241 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. తిరిగి వచ్చి చూసేసరికి ఆభరణాలు కనిపించలేదు. అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇలా చిక్కాడు..

కాకినాడ జిల్లా తుని రూరల్ మండలం తలుపులమ్మ లోవలో భక్తుల కార్లను టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తున్న వ్యక్తిని తుని రూరల్ పోలీసులు కొద్దిరోజుల క్రితం అరెస్టు చేశారు. ఆ సమయంలో కొంత బంగారాన్ని అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణ చేస్తున్న సమయంలో ఇంద్రకీలాద్రిపై కారులో చేసిన చోరీ బయటకు వచ్చింది. నిందితుడి స్వస్థలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం. అక్కడి నుంచి కారులో బయల్దేరి చోరీలు చేసుకుని స్వాక తిరిగి వెళ్లిపోతాడు. అతడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ఉన్నత విద్యాభ్యాసం చేస్తుండగా, కుమారుడు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. దొంగిలించిన వస్తువులను ఏలూరు జిల్లా కైకలూరు మండలం గ్రామానికి చెందిన ఓ బంగారం వ్యాపారికి విక్రయించాడు. మహారాష్ట్రకు చెందిన ఆ వ్యాపారి వద్ద నుంచి పలు చోరీలకు సంబంధించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కారుతో పాటు విజయవాడ తరలిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారం తెలియడంతో బంగారం వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది. నిందితుడి వయస్సు 45 ఏళ్లు ఉంటుంది. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల వద్ద పలు చోరీలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఇంద్రకీలాద్రిపై ఎన్ని చోరీలు చేశాడు, ఉమ్మడి జిల్లాలో ఏయే ఆలయాల వద్ద ఈ తరహా దొంగతనాలు చేశాడు అనే వివరాలు విచారణలో బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

యానాంలో భారీ వర్షం

రోడ్లు జలమయం

యానాం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. భారీఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం, ఈదురుగాలులతో పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నీరు చేరి వర్షంనీరు నిలిచిపోయింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. పిల్లారాయ స్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ సముదాయాలు నీటమునిగాయి. ముంపు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థను యానాం పరిపాలనాధికారి అంకిత్ కుమార్ అధికారులతో కలసి పర్యవేక్షించారు.


వర్షం నీటిలో వెళ్తున్న విద్యార్థులు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'ఉపాధి శ్రామికుల నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి'

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే శ్రామికుల నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు డ్వామా ఏపీడీ వసంతమాధవి తెలిపారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి రికార్డులను ఆమె పరిశీలించారు. సిబ్బందితో సమీక్షించారు. గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు, ఏపీవో గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న 'కాయకల్ప' బృందం సభ్యులు

'కాయకల్ప' బృందం పర్యటన

పెద్దాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప అసెస్‌మెంట్ బృందం బుధవారం సందర్శించింది. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సౌకర్యాలపై నిర్వహణ వ్యవస్థ ఉన్నత ప్రమాణాలను పరిశీలించింది. అందిస్తున్న సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.ఉమామహేశ్వరి వివరించారు. అన్ని విభాగాలను, డాక్యుమెంటేషన్ ప్రక్రియలపై సభ్యులు నిశితంగా సమీక్షించారు. ఆసుపత్రి సిబ్బంది, రోగులతో మాట్లాడారు. ముఖ్యంగా ఉన్నత నిర్వహణ ప్రమాణాలను, ప్రజారోగ్య సౌకర్యాల్లో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులను మెరుగుపరచడం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కాయకల్ప అసెస్‌మెంట్ నోడల్ ఆఫీసర్ వి.శ్రీవిద్య, హెడ్ నర్సు రమాదేవి, ఫార్మసిస్ట్ కమలాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సు డ్రైవర్లు, కీనర్లనుద్దేశించి మాట్లాడుతున్న ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాకినాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు బస్ డ్రైవర్లు, క్లీనర్లు సుమారు 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. చికిత్స అవసరమైన వారిని తదుపరి పరీక్షల కోసం ఎంపిక చేసినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు.

డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రవాణా శాఖ అధికారి కృష్ణమూర్తి వివరించారు. శిబిరంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి టి.తేజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైద్యురాలు శిరీష, టెక్నీషియన్లు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ, టీడీపీ నేత ప్రభాకర్

మహిళా యోగా సెంటర్ నిర్మాణానికి శ్రీకారం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆరోగ్యం, శారీరక బలం, మానసిక ప్రశాంతత కల్పించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతుల్ని చేసి అన్ని రంగాల్లో మరింత రాణించేలా ప్రత్యేకంగా యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రూరల్ వాకలపూడి సచివాలయం-2 పరిధిలో బయోఫ్యూయల్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.39.76లక్షల సీఎస్ఆర్ నిధులతో మహిళా యోగా సెంటర్ నిర్మాణ పనులకు టీడీపీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ రంబాల వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, ఎంపీడీవో పసుపులేటి సతీష్, గ్రామ కార్యదర్శి పిడుగు పాండు రంగారావు, కూటమి నాయకులు గంటా ప్రసాద్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి డ్రైనేజీని పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తాం

అదనపు కమిషనర్ సుధాకర్ హెచ్చరిక

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లపై చెత్త వేస్తే కఠినంగా జరిమానా విధిస్తామని అదనపు కమిషనరు కేటీ సుధాకర్ హెచ్చరించారు. బుధవారం ఆయన పలు డివిజన్లలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. జగన్నాథపురంలోని చంద్రిక థియేటర్ వద్ద కల్వర్టుపై స్లాబు లేక ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించిన ఆయన తక్షణం స్లాబు వేయాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డు వద్ద సమస్యలను అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. తాగునీటి సాంద్రతను పరీక్షించి ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. సంజీవ్‌నగర్‌లో అన్న క్యాంటీన్ కార్యకలాపాలను పరిశీలించారు. అల్పాహారం నాణ్యతగా లేదని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు రాంబాబు, నాయుడు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నరసింగపురంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి

పిఠాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం నరసింగపురంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆ గ్రామ సర్పంచ్ దెయ్యాల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికను అభివృద్ధి చేయాలన్నారు. పిఠాపురం నుంచి నరసింగపురం వరకు రోడ్డు నిర్మించాలని, ఉన్నత పాఠశాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని విన్నవించారు. వీటిపై కలెక్టర్ పరిశీలన జరిపారు. కావాల్సిన స్థలాలు అందుబాటులో ఉన్నాయా లేదా ఆరా తీశారు.

మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే పరామర్శ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాలుకి గాయమై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిని బుధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. ఆమె సత్వరం కోలుకోవాలని ఆకాంక్షించారు.

శివాలయాల్లో విశేష పూజలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండంలోని దుర్గాడ శివాలయానికి బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయం ఎదురుగా ఉన్న కోనేరులో దీపాలు వెలిగించి వదిలారు. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకారం చేసి సప్తహారతులు ఇచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయానికి తెల్లవారుజామునే భక్తులు వచ్చి పాడ్యమి దీపాలు వెలిగించారు. ఉమారామలింగేశ్వరస్వామికి అర్చకులు అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాల్లో ధ్వజస్తంభాల వద్ద భక్తులు జ్యోతులు వెలిగించారు. కొత్తపల్లిలో బాలాత్రిపురసుందరి సమేత రాజశేఖర స్వామి, ఉప్పాడలో శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, కొమరగిరిలో విశ్వేశ్వర స్వామి, నాగులాపల్లిలో శివాలయం, రమణక్కపేటలో విజయజనార్దనస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కోరింగలో బాలాత్రిపురసుందరి సమేత కురంగేశ్వరస్వామి, తాళ్లరేవులో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు కొత్తలంక సాయిప్రసాద్, కొండవీటి శివరామకృష్ణ అభిషేకాలు జరిపారు. పటవల, నీలపల్లి, చొల్లంగి గ్రామాల్లోని పురాతన శివాలయాల్లో స్వామివార్లకు భక్తులు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో పాడ్యమి దీపాల వెలుగులో ఉమారామలింగేశ్వరస్వామి





గొల్లప్రోలు కరణం గారి తోటలో కనకదుర్గమ్మకు గాజులతో చేసిన అలంకారం

108 రకాల పిండి వంటలు, పండ్లతో సమర్పించిన సారె

కనకదుర్గమ్మకు కోటి గాజుల మహోత్సవం

గొల్లప్రోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు కరణం గారి తోటలో వేంచేసియున్న కనకదుర్గమ్మకు కోటి గాజుల మహోత్సవానికి బుధవారం శ్రీకారం చుట్టారు. కార్తీక మాసం తొలిరోజు సుమారు 10లక్షల గాజులతో అమ్మవారికి అలంకారం చేశారు. 108 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు. సారెతో పాటు చీర, రవిక, గాజులు, పండ్లు, పసుపు, కుంకుమ తీసుకుని భక్తులు ప్రదర్శనగా ఆలయానికి తరలివచ్చారు. కనకదుర్గమ్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గరగ తాతాజీ, పిలక బాబూరావు, కొంతం ఆదిభవానీ తదితరులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాడి రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేడ్కర్

కరప, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేడ్కర్, ఉమ్మడి జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (డీఎల్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు సూచించారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్‌లో భాగంగా వాకాడలో బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత పశు వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. లింగ నిర్ధారణ, వీర్యం ప్రాముఖ్యత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. పాడి గేదెలు, గోవులకు గర్భకోశ చికిత్స, పలు పరీక్షలు నిర్వహించారు. వేములవాడ సొసైటీ చైర్‌పర్సన్ దూడల నారాయుడుతో కలిసి పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, లివర్ టానిక్‌లు అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ ఎన్‌జేఎస్ సురేష్ బాబు, డీఎల్‌డీఏ వీఏఎస్ కళ్యాణి, వేళంగి పశువైద్యాధికారి డాక్టర్ పి.రామచంద్రరావు, డాక్టర్ వీజీఎన్‌వీ ప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్ర అడపా చంటిబాబు, గ్రామ పెద్దలు కామిరెడ్డి సురేష్, ఆకుల శ్రీనివాస్, పెంకే సోమరాజు, రామచంద్రపురం వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



వెటర్నరీ డీడీ అంబేడ్కర్‌తో కలిసి మినరల్ మిక్చర్ ప్యాకెట్ అందజేస్తున్న వేములవాడ సొసైటీ చైర్మన్ నారాయుడు



వాలీబాల్‌లో తలపడుతున్న విద్యార్థులు

చేబ్రోలులో స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగే క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. వీటిని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. గొల్లప్రోలు ఎంఈవోలు వెన్నా శివ, వెంకట శివప్రసాద్, హెచ్ఎం సీహెచ్ ప్రకాష్, పీడీలు తోట వెంకటరాజులు, నరాల శ్రీహరి, గారపాటి శ్రీను, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

వాకలపూడిలో వంశీకృష్ణ పెట్రోలు బంకు సీజ్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని వంశీకృష్ణ లారీ ఓనర్స్ అసోసియేషన్ పెట్రోలు బంకును సీజ్ చేసినట్టు ఏఎస్‌వో ప్రసన్నలక్ష్మీదేవి తెలిపారు. ఎటువంటి బిల్లులు లేకుండా కాకినాడ ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న మోహన్‌కృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోలు బంకు నుంచి ఐదువేల లీటర్ల డీజిలును వంశీకృష్ణ బంకుకు తరలించినట్టు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో వంశీకృష్ణ పెట్రోలు బంకుపై 6(ఎ) కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేశామని చెప్పారు.

మాధవపట్నం తూముల మూసివేతతోనే ఆటోనగర్‌కు ముంపు బెడద

ఎమ్మెల్యే చినరాజప్ప వద్ద ఆటోనగర్ కార్మికుల ఆవేదన

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవపట్నం గ్లోబల్ ఆసుపత్రి వద్ద మురుగు కాలువలోకి వెళ్లే తూములు పూడికతో మూసుకుపోవడంతో రైల్వే గేటు ఆవలి వైపున ఉన్న ఆటోనగర్ తరచూ ముంపు బెడద ఎదుర్కొంటోందని పలువురు ఆటోమొబైల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను అచ్చంపేటలోని ఆయన నివాసంలో కలిశారు. తరచూ ముంపుతో సుమారు 400 మంది మోటారు కార్మికులకు పనులు లేక ఉపాధి కొరవడుతోందని తెలిపారు. సత్వరం స్పందించిన ఎమ్మెల్యే చినరాజప్ప పంచాయతీ ఉన్నతాధికారులు, డ్రైన్ల ఇంజనీరింగ్ అధికారులతో ఫోనులో మాట్లాడి ముంపు సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మధ్యాహ్నం అధికారులు రంగ ప్రవేశం చేసి మాధవపట్నం వద్ద తూముల్లో పూడికను తొలగించే పనులు ప్రారంభించారు.

అచ్చంపేటకు చెందిన పలువురు లబ్ధిదారులకు గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో రోడ్డు మార్గం సమస్య అలాగే ఉన్నందున సత్వరం పరిష్కరించాలని అచ్చంపేట పీఏసీఎస్ అధ్యక్షుడు అడ్డాల వెంకన్నబాబు, లబ్ధిదారులు ఎమ్మెల్యే చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు.





చేబ్రోలులో బాలింత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), జనసేన నేతలు

బాలింత కుటుంబానికి పలువురి పరామర్శ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బాలింత కుటుంబాన్ని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి బుధవారం సాయంత్రం పరామర్శించారు. గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో బిడ్డను ప్రసవించిన అనంతరం సీరియస్ అయి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ మరణించిన విషయం తెలిసిందే. కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బిడ్డ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వారికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పీడీ వెంట గొల్లప్రోలు తహసీల్దారు రామ్‌కుమార్, ఏపీడీ వసంతలక్ష్మి ఉన్నారు.

శ్రీదుర్గ కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన నేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ పరామర్శించారు. పసిబిడ్డకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జనసేన పార్టీ అండగా ఉంటారని తెలిపారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట పలువురు జనసేన నాయకులు ఉన్నారు. శ్రీదుర్గ కుటుంబాన్ని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు పరామర్శించారు.



అధికారులతో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే కొండబాబు

అభివృద్ధి పనుల ప్రణాళికలపై సమీక్ష

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టే పలు అభివృద్ధి పనుల ప్రణాళికలపై బుధవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జగన్నాథపురంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, పారిశుధ్యం, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పనపై సూచనలు చేశారు. కార్పొరేషన్ అదనపు కమిషనరు కేటీ సుధాకర్, డిప్యూటీ సిటీ ప్లానర్ కృష్ణారావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకట్రావు, టీపీఆర్‌వో శైలజ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



గ్రామ సంకీర్తన చేస్తున్న యువకులు

కార్తీకమాస గ్రామ సంకీర్తన

కొత్తపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా వాకతిప్ప రామాలయం వీధికి చెందిన యువకులు బుధవారం గ్రామ సంకీర్తనను ప్రారంభించారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి వీధుల్లో కార్తీక మాసం నెల రోజులు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి శివుని చిత్రపటాన్ని చేతపట్టి భజన చేస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ ప్రజల్లో భక్తిభావం పెంపొందిస్తారు.

అయ్యప్పస్వాములకు భిక్ష ప్రసాదం

తాళ్లరేవు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా తాళ్లరేవు జాతీయ రహదారి పక్కన గల అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్వాములకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఏర్పాటు చేసిన భిక్ష ప్రసాదాన్ని బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే దంపతులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు ధూళిపూడి బాబి, కట్టా త్రిమూర్తులు, మాజీ చైర్మన్లు వుంగరాల వెంకటేశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, దేవస్థానం చైర్మన్ గాదిరాజు సతీష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం పట్టణ శివారులో ఇళ్ల స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఇళ్ల స్థలాలకు సేకరించిన భూముల పరిశీలన

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ శివారులో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను కలెక్టర్ షాన్‌మోహన్ పరిశీలించారు. గత ప్రభుత్వ హయంలో సేకరించిన 62 ఎకరాల భూమి ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట పిఠాపురం తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏడీ వల్లీప్రియ వున్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

సీపీఆర్‌పై శిక్షణ

కాకినాడ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్, వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విద్యాంజలి స్కూలు 9వ తరగతి విద్యార్థులకు సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కళ్యాణచక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్కూల్ సీపీఆర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, ట్రస్టు ఆసుపత్రి డాక్టర్ రామకృష్ణ సీపీఆర్ చేసే విధానాన్ని డెమో ద్వారా వివరించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ మెడికల్ కేర్ మెడిసన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సామవేద శ్రీనివాస్, ఇండియన్ రెసిపిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎన్‌సీ చక్రరావు, క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, కోశాధికారి ఉదయచక్రవర్తి, శ్రీనివాస్, చిరంజీవిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో కార్తీకమాస సందడి

రంపచోడవరం, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో బుధవారం తెల్లవారు జామునుంచి శివాలయాల్లో కార్తీక మాస సందడి నెలకొంది. శివాలయాలు భక్తులతో కిటకిటలడాయి. స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి, రంప శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి, మద్దివీడు శివాలయాల్లో శివనామస్మరణతో భక్తులు ప్రత్యేక పూజలు చేసినట్లు హిందూ ధర్మ ప్రచార భక్తమండలి కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి తెలిపారు..

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కొమరం భీమ్‌కు ఘన నివాళి


చింతూరులో చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తన హక్కుల సాధన విషయంలో ఆదివాసీ యువత కొమరం భీమ్ పోరాట తత్వాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం జిల్లా నేత సీసం సురేష్ పేర్కొన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీమ్ 125వ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి సీపీఎం సీనియర్ నేత మడకం చిన్నయ్య పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పొడియం లక్ష్మణ్, కారం మనోజ్, కూర సత్యనారాయణ, కలుముల ముత్తయ్య, కట్టం బాబూరావు, నాగేశ్వరరావు, జానీ, కట్టం గంగమ్మ, సింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: దేవారం గ్రామ పంచాయతీ పోతవరం గ్రామ రామాలయంలో బుధవారం గోండు బొబ్బిలి కొమరం భీమ్ 124 జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ అనాడు నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడరన్నారు. కార్యక్రమంలో భారత్ ఆదివాసీ పార్టీ దేవీపట్నం మండల అధ్యక్షుడు చవలం విద్యాసాగర్, ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర, కారం రంగారావు దొర, కారం సత్యనారాయణ దొర, మడకం కృష్ణ దొర, తదితరులు పాల్గొన్నారు.

రామనామ స్మరణతో మార్మోగిన రామదుర్గం

దేవీపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నేలకోట సమీపంలోని రామదుర్గం కొండపైన కార్తీకమాసాన్ని పురస్కరించుకొని బుధవారం మైదాన ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో రామనామంతో ఆలయం మార్మోగింది. శివాలయం, రామాలయం, దుర్గమ్మఆలయంతో పాటు పలు ఆలయాలు కొండపైన ఉన్నాయి. ప్రతి సంవత్సరం కార్తీకం ముందు రోజు పూజలు చేసిన అనంతరం మరుసటి రోజు భారీ అన్నసంతర్పణ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని భక్తుడు దోసకాయపల్లి కృష్ణ తెలిపారు.

గిరిజనేతరుల భూముల్లో జెండాలు పాతిన గిరిజనులు

కూనవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం తీసుకొని స్థానికంగా లేని గిరిజనేతరుల భూస్వాముల భూముల్లో కొంతమంది గిరిజనులు జెండాలు పాతారు. పరిహారం తీసుకొని వారు ఇక్కడ ఉండకుండా ఏజెన్సీలో లీజుకు ఇస్తున్నారని, కాబట్టి ఆ భూములను ఇక నుంచి గిరిజనులే సాగు చేసుకుంటామని తెలిపారు. పోలవరం పరిహారం తీసుకొని స్థానికంగా లేని భూస్వాములను ఇద్దరిని గుర్తించామని, అందులో ఆర్‌వీ రామారావుకు చెందిన 68 ఎకరాలు, విజయరామ్మోహన్ రావుకు చెందిన 30 ఎకరాల భూముల్లో జెండాలు పాతినట్టు చెప్పారు. స్థానికంగా ఉండి వ్యవసాయం చేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. వలస రైతులకు వచ్చే ఏడాది నుంచి ఇక్కడి భూములను కౌలుకు ఇస్తే సహించేది లేదన్నారు. దీనిపై పలు మార్లు ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇక నుంచి ఈ ఉద్యమం దశలవారీగా కొనసాగుతుందన్నారు. సీపీఎం అనుబంధ గిరిజన సంఘం, ఆదివాసీ రైతు సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

తెలుగు రైతు సంఘం ఎన్నిక

కూనవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూనవరం మండలం టీడీపీ అనుబంధ సంఘమైన తెలుగు రైతు సంఘం ఎన్నిక ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది అధ్యక్షుడిగా లంబు వాసు, ప్రధాన కార్యదర్శిగా తుంగల కన్నారావు ఎన్నికయ్యారు. వీరితోపాటు పదిమంది కమిటీ సభ్యులను ఎనుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, దాసరి నాగేశ్వరరావు, చలకాని ఉమామహేశ్వరరావు, హెచ్ రవి, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ శకుంతలకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టా పొందిన శకుంతల

చింతూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగపతి (లెక్చరర్) కించే శకుంతల డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. రత్నమాణిక్యం, సహచర అధ్యాపక బృందం ఆమెను అభినందించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ పట్టాను ప్రదానం చేసింది. ఆమెకు ప్రొఫెసర్ సముద్రనీల్‌పాల్, భర్త అద్దంకి సుధాకర్, కుటుంబ సభ్యులు విజయభారతి, డా. డాల్ పడాల్, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందజేత

చింతూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కారం లాలమ్మ ఇంటి నిర్మాణానికి టీడీపీ నేత జమాల్‌ఖాన్ బుధవారం మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. కారంగూడెంకు చెందిన ఆదివాసీ మహిళ లాలమ్మ ఇల్లు గాలిదుమారానికి ఇటీవల కూలిపోయింది. దీంతో తన ఇంటి నిర్మాణానికి సహకరించాలని జమాల్‌ఖాన్‌ను అభ్యర్థించగా, ఈమేరకు ఆయన స్పందించారు. ఎండీ జహంగీర్, పసుపులేటి సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మోతుగూడెం ఎంపీటీసీ


సీఎంను కలిసి విన్నవిస్తున్న వెంకటరమణ

మోతుగూడెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ కార్యాలయంలో బుధవారం మోతుగూడెం ఎంపీటీసీ కరకా వెంకటరమణ సీఎం చంద్రబాబును కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అలాగే డొంకరాయి గ్రామాన్ని మండల కేంద్రం చేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి కరకా ప్రేమకిరణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నీలాపు సత్యనారాయణ, మండల కార్యదర్శి మద్దెల యాకోబు, యూనిట్ కోఇన్‌చార్జి దుంగా రాజు, తదితరులు ఉన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై వర్క్‌షాప్

రంపచోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలు పరిష్కరించేలా వర్క్‌షాప్ నిర్వహించామని పీజీఆర్ఎస్ వర్క్‌షాప్ జిల్లా ఇన్‌చార్జి డి.రవికుమార్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ తిరుమణి పూజ ఆదేశాల మేరకు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో వర్క్‌షాప్ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిణి ఎం.సావిత్రి, తహశీల్దార్లు సీహెచ్ శ్రీనివాసరావు, వేణుగోపాల్, కరక సత్యనారాయణ, బాలాజీ, దొరకయ్య, ఏవీ సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్లు జిలానీ, శ్రీరాములు, ఏడు మండలాల సర్వేయర్లు, ఆర్ఐలు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జ్యుడిషియల్ విచారణ చేపట్టాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

రంపచోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అడ్డతీగల మండలం గొంటువానిపాలెం నల్లకొండ మెటల్ క్వారీలో మురద చిన్నయ్యదొర మృతిపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ చేయాలని, అలాగే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు, జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి ప్రభుతాన్ని బుధవారం డిమాండ్ చేశారు. అక్రమంగా బినామీ పేర్లతో క్వారీ నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుడు మృతికి కారకులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కార్తీకం ప్రారంభం.. శివాలయాలు కిటకిట

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● గ్రామాల్లో భక్తుల సందడి



ప్రత్తిపాడు: రాచపల్లిలో నగర సంకీర్తనలో ఆవుకు పూజలు చేస్తున్న మహిళలు, ఏలేశ్వరం శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రత్తిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీకం ప్రారంభం పురస్కరించుకుని ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, గజ్జనపూడి, ఎరకంపాలెం, తోటపల్లి, ధారపల్లిలోని శివాలయ ప్రదేశాలు కిటకిటలాడాయి. రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో గోదేవత, విఘ్నేశ్వర పూజలు, అరుణాచలేశ్వరునికి అభిషేకాలు, పరివార దేవతా మూర్తులకు పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు, హోమం, పూర్ణాహుతి, ఆకాశ దీపోత్సవం, కార్తీక పురాణ ప్రవచనాలు, గంగాహారతులు వంటివి నిర్వహించారు. ధర్మవరం, రాచపల్లిలో నెల రోజులుజరిగే నగర సంకీర్తనలు ప్రారంభించారు. గోవులను గ్రామాల్లో ఊరేగించగా మహిళలు వాటికి పూజలు నిర్వహించారు. దొడ్డిపట్ల సోమన్న దొర, సిద్దా అప్పల రాజు, కుప్పిన నరసింహమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఏలేరు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, పాడ్య మి దీపాలు వెలిగించి శ్రీరాజరాజేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మహేష్, శేఖర్, వెంకటేష్ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

'రామ్‌కుమార్ సేవలు మరువలేనివి'


వృద్ధులకు దుస్తులు, పండ్లు, భోజన ప్యాకెట్లను అందిస్తున్న చైర్మన్ రోహిత్

అన్నవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఆలయ అభివృద్ధిలో దివంగత చైర్మన్ రామ్‌కుమార్ సేవలు మరువలేనివని శంఖవరం వైస్ ఎంపీపీ దారా వెంకటరమణ అన్నారు. బుధవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఆయన బంగ్లాలో దేవస్థానం ఉద్యోగులు, పురోహితులు, పార్టీలకతీతంగా నాయకులు పాల్గొని ఘన నివాళులర్పించారు. రామ్‌కుమార్ చిత్రపటానికి ఆయన తనయుడు, ప్రస్తుత దేవస్థానం చైర్మన్ రోహిత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, ఆహార పొట్లాలను అందించారు. విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పేరూరి గాంధీ, వీర్ల సూరిబాబు, వ్రతపురోహిత సంఘ అధ్యక్షులు చామర్తి వెంకటరెడ్డి పంతులు, మొకరాల రాజేష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘ అధ్యక్షులు గంటా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ స్టోరేజ్ పరిశీలన

ఏలేశ్వరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజ్‌నుబుధవారం సంయుక్త సంచాలకులు డాక్టర్ శైలజ పరిశీలించారు. బ్లడ్ బ్యాంక్‌గా మార్చడానికి అవసరమయ్యే మౌలిక వసతులు, ఓపీ, రికార్డులు తదితర అంశాలపై సూపరింటెండెంట్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంక్ ఎంతో అవసరం ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు క్షుణ్ణంగా నివేదిక అందిస్తానని శైలజ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వాగు రాజేష్, వైస్ చైర్మన్ జొన్నాడ వీరబాబు, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, వీఆర్వో అవసరాల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి దీపారాధన సామగ్రి వితరణ

ఏలేశ్వరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో శ్రీకనకదుర్గా అమ్మవారి ఆలయానికి ఇత్తడి దీపారాధన కుందులను బుధవారం గ్రామానికి చెందిన మానూరి గంగరాజు, లత దంపతులు అందించారు.

3న కోటి దీపోత్సవం, సహస్ర లింగార్చన


కోటి దీపోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో నవంబరు3న కోటి దీపోత్సవం, సహస్ర లింగార్చన నిర్వహణకు సన్నాహాలు చేపట్టారు. కోటి దీపోత్సవ పోస్టర్‌నుబుధవారం పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆవిష్కరించారు. ప్రత్తిపాడులో డీసీసీబీ బ్యాంక్ వెనుక ఉన్న రావూరి సత్యనారాయణ స్థలంలో కోటి దీపోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తేజోమూర్తుల సుబ్రహ్మణ్యశర్మ, పత్రి రమణ తెలిపారు. నిర్వహణ ప్రదేశాన్ని సందర్శించిన వారిలో సుబ్రహ్మణ్య శర్మ, రమణ, పోలిశెట్టి శ్రీను, గానాల గంగాధర్, రాయుడు దొరబాబు, చిలకమర్తి వీరభద్రం ఉన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే


ఆత్మకమిటీ చైర్మన్ ప్రకాష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

అన్నవరం,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. బుధవారం అన్నవరం ప్రైవేట్ రిసార్ట్‌లో తుని జోన్ ఆత్మకమిటీ పాలకవర్గ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. చైర్మన్‌గా నరహరశెట్టి సూర్యప్రకాష్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల ఆత్మ కమిటీ పాలకవర్గ సభ్యులు ఒక కుటుంబంలా కలసి రైతుల అభివృద్ధికి పనిచేయాలన్నారు. మరో ముఖ్యఅతిథి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ కమిటీ సభ్యులు రైతుల సమస్యలు తెలుసుకుని వారికి సాంకేతికతపై అవగాహన కల్పించాలన్నారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన హామీలను నెరవేర్చి అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల అకౌంట్లలో నగదు జమచేయడం, ఎక్కడా ఎరువుల కొరత రాకుండా చేసి పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను గొడౌన్లలో నిల్వ చేసుకునేందుకు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రాజా అశోక్‌బాబు, వెన్నా ఈశ్వరుడు, పర్వత సురేష్ స్థానిక నాయకులు వీర్ల సూరిబాబు, పసుపులేటి చక్రధరరావు, మెరపల నరసయ్య పాల్గొన్నారు.

బీజేపీలో గోనేడ ఎంపీటీసీ చేరిక


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో అల్లు శివరామకృష్ణ

కిర్లంపూడి అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గోనేడ ఎంపీటీసీ, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జగ్గంపేట ఇన్‌చార్జి దాట్ల కృష్ణ వర్మ, కిర్లంపూడి మండలాధ్యక్షులు శరకణం రాజబాబు, పెద్దిశెట్టి సత్తిబాబు, శేఖ రమణ తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో విజిలెన్స్ దాడులు


కత్తిపూడి ఎరువుల దుకాణంలో స్టాకు పరిశీలిస్తున్న అధికారులు

శంఖవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో బుధవారం ఉదయం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ నాగవెంకటరాజు ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలు, హోటళ్లు, అక్రమంగా గ్యాస్‌ను ఎక్కిస్తున్న దుకాణాలను పరిశీలించారు. 6సిలిండర్లను గుర్తించి సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌వో జి.రవి తెలిపారు. గ్రోమోర్ ఎరువుల దుకాణంలో రికార్డులు, గొడౌన్‌లో ఎరువులు పరిశీలించి రెండు సరితూగినట్లు గుర్తించామని తెలిపారు. దాడుల్లో వ్యవసాయశాఖ ఏవో పి.గాంధీ, విజిలెన్ ఏజి లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

యువత పరిశ్రమలపై అవగాహన పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్ వర్మ

ఏలేశ్వరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నేటి యువత పరిశ్రమలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో రవి కుమార్‌వర్మ అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 20రోజులు సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వ్యాపార రంగం, ప్రభుత్వం నుంచి పరిశ్రమకు వచ్చే సబ్సిడీలు, యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేసే విధానం, బ్యాంకు నుంచి తక్కువ వడ్డీకి రుణాలు పొందే విధానం తదితర అంశాలపై మంగళగిరి ట్రెడ్ ఐటీ కళాశాల, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) సంయుక్తంగా శిక్షణ ఇస్తుందన్నారు. ఐఐసీ చైర్మన్ ప్రగడ ప్రయాగమూర్తి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, రామారావు బంగార్రాజు, పుష్ప, మేరీ, ధర్మరాజు, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

జగ్గంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తునిలో బాలికను అత్యాచారం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ అన్నారు. బుధవారం జగ్గంపేటలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తుని రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తునిలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని మున్సిపల్ కౌన్సిలర్‌లతో పాటు కౌన్సిల్ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరామర్శించారు. చైర్‌పర్సన్ భువన సుందరి మాట్లాడుతూ కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. పరామర్శించిన వారిలో వైస్ చైర్మన్ కొచ్చెర్లపాటి రూపాదేవి, కౌన్సిలర్లు తుమ్మలపల్లి సుశీల, వారాహి జ్యోతి, కర్రి శ్రీదేవి, సూరిశెట్టి సుభద్రదేవితోపాటుగా టీడీపీ నాయకులు యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, మళ్ల గణేష్ తదితరులు ఉన్నారు.

రాజకీయ జోక్యం ఉండదు: బాలికపై అత్యాచార ఘటన దారుణమని తుని సీనియర్ నాయకుడు యినిగంటి సత్యనారాయణ అన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఘటనలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండబోదని ఆయన తెలిపారు.


కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మిని పరామర్శిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ప్రత్తిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిని బుధవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆమె వద్దకు ఎమ్మెల్యే వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట యాళ్ళ జగదీష్, అంబటి రాంబాబు తదితరులు ఉన్నారు.


గండేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర

పౌరసరఫరాల శాఖ రాష్ట్ర చైర్మన్ సుధీర్

గండేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి ధాన్యం గింజకు కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని పౌర సరఫరాల శాఖ రాష్ట్ర చైర్మన్ తోట సుధీర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. బుధవారం గండేపల్లి వ్యవసాయ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం క్వాలిటీ నిర్ధారించే మిషన్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోపు వారి ఖాతాల్లోకి డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్, ఆర్డీవో శ్రీరమణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పల రాజు, కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల మోహన్ రావు, ఏఎంసీ చెర్మన్ అడపా భరత్, అడబాల భాస్కరరావు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, యువ నాయకులు జాస్తి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న నవీన్

జగ్గంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం గోకవరానికి చెందిన కంటిపూడి సునీత రమాదేవికి రూ.36,278, గోకవరం మండలం గాదేల పాలెం గ్రామా నికి చెందిన పీత రాజేశ్వర్‌కి రూ.71834 సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పల రాజు, మండలాధ్యక్షుడు జీనుమణి బాబు, రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ భూపాల పట్నం ప్రసాద్, తెలుగు యువత మండల అధ్యక్షులు ఆర్.సాయి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ విశ్లేషణపై ప్రత్యేక శిక్షణ తరగతులు



గండేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎటాబ్స్ ఉపయోగించి నిర్మాణం విశ్లేషణ అనే అంశం పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జెపెనిస్ ప్లానర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోని స్ట్రక్చరల్ ఇంజనీర్ మోహన్ బలగ ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణ తరగతులు నిర్వహించారు. కోర్సు సమయంలో విద్యార్థులు ఎటాబ్స్ సాఫ్ట్‌వేర్‌పై ఆచరణాత్మక శిక్షణ పొందారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్‌బాబు

గ్రామాల అవసరాల ప్లానింగ్ నివేదికలు సిద్ధం చేయాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని అవసరాలను గుర్తించి వాటి ప్లానింగ్ నివేదికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సభలో ఎంపీడీవో మాట్లాడుతూ నవంబరులో గ్రామ సభల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతినెలా 1న నిర్వహించే పింఛన్ల పంపిణీలో మిగిలిన సొమ్ములు జాప్యం లేకుండా వెంటనే జమ చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాధ్, కార్యదర్శులు జ్యోతుల పద్మరాజు, చెల్లుబోయిన వేణుగోపాల్, వి.వీరబాబు, లక్ష్మీనారాయణ, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన నాయకులు

టీడీపీలోకి భారీగా చేరికలు

తుని రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం దానవాయిపేట నర్సిపేటకు చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో సీనియర్ నాయకుడు యనమల రాజేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. టీడీపీలో చేరిన వారిలో దానవాయిపేటకు చెందిన కందాల సత్తిబాబు, కందాల జగదీష్, కందాల లోవరాజు, అర్జిల్లి సత్తియ్య, చొక్కా హరిబాబు, చొక్కా నాగేష్, నర్సిపేటకు చెందిన మడద బుజ్జి, చొక్కా కాశీ, చొక్కా జాషువా ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కోడా వెంకటరమణ, అనుసూరి అర్జున్, రాయుడు బాల నర్సయ్య, నరాల విశ్వనాధం, పాలిక సత్యనారాయణ ఉన్నారు.